క్లుప్తంగా

గురుకులంలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు

కొనకనమిట్ల: మండలంలోని వెలుగొండ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2025–26లో 6,7,8,9 తరగతులకు, ఇంటర్ మొదటి సంవత్సర ప్రవేశ పరీక్షకు ఏర్పడిన ఖాళీలను పూరిస్తున్నట్లు వెలుగొండ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్కే ఇబ్రహీం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 25న గురుకుల పాఠశాల దర్శిలో బాలురకు, బాలికలకు మార్కాపురం గురుకుల పాఠశాలలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి కుల ధ్రువీకరణ పత్రాల ద్వారా వారికి కేటాయించిన రోస్టర్ ప్రకారం అడ్మిషన్లు ఇస్తారన్నారు. అర్హులైన విద్యార్థులు వారికి కావాల్సిన పాఠశాలలో దరఖాస్తులను 23వ తేదీ వరకు సంబంధిత పాఠశాలలలో దరఖాస్తులను అందజేయాలన్నారు. 23వ తేదీ తరువాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించరని ప్రిన్సిపాల్ అన్నారు.

జులై 7న ఎమ్మార్పీఎస్ మహాసభ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బేస్తవారిపేట: ఒంగోలులో నిర్వహించే ఎమ్మార్పీఎస్ మహామేళ మహాసభకు అధిక సంఖ్యలో తరలి రావాలని ఎమ్మార్పీస్ నియోజకవర్గ కన్వీనర్ బూదాల ఆనంద్ పేర్కొన్నారు. స్థానిక ఎమ్మార్పీస్ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. జులై 7వ తేదీన జరిగే మహాసభకు నాయకులు, కార్యకర్తలు రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ మండల అధ్యక్షుడు వేశపోగు భరణి, నాయకులు కువ్వారపు జయమ్మ, మీగడ నాగేశ్వరరావు, చల్లగాలి ప్రవీణ్, తోటకూర ప్రసన్న, కువ్వారపు బెంజిలు పాల్గొన్నారు.

నారుమడులు దృఢంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి గోపీచంద్

కొమరోలు: షెడ్‌నెట్ నర్సరీలల్లో పెంచే నారుమడులు దృఢంగా ఉండాలని ఉద్యానవన విశ్వవిద్యాలయ సీనియర్ శాస్త్రవేత్త రవీంద్ర బాబు తెలిపారు. మండలంలోని దద్దవాడ రైతు సేవా కేంద్రంలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో శనివారం షెడ్‌నెట్ నర్సరీ యజమానులకు అవగాహన సమావేశం నిర్వహించారు. సీనియర్ శాస్త్రవేత్త రవీంద్రబాబు మాట్లాడుతూ వర్షా కాలంలో నారుకుళ్లు రావడం, ఆకుల మీద మచ్చలు రావడం, చీడపీడల బెడద ఎక్కువగా ఉంటాయన్నారు. మొలకల శాతం తక్కువగా వస్తాయని, తగు జాగ్రత్తలు తీసుకోవడం వలన నారు దృఢంగా ఉంటుందని తెలిపారు. జిల్లా ఉద్యానవన శాఖాధికారి గోపీచంద్ మాట్లాడుతూ నర్సరీ నడుపుతున్న ప్రతి ఒక్క యజమాని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. నర్సరీలో నాణ్యత గల ఆరోగ్యకరమైన అధిక దిగుబడులు ఇచ్చే వంగడాలు ఉత్పత్తి చేయాలని తెలిపారు. కొనుగోలుదారులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. నిబంధనలు పాటించని నర్సరీ యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారిణి సాయి శ్వేత, విస్తరణ అధికారులు, పట్టుపరిశ్రమ సహాయకులు పాల్గొన్నారు.

అంకమ్మతల్లి దీవించమ్మా..



అలంకరణలో అంకమ్మతల్లి

కొనకనమిట్ల: అంకమ్మ తల్లి దీవించమ్మా అంటూ మండలంలోని సిద్ధవరం గ్రామంలో శనివారం అమ్మవారి కొలుపుల ఉత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గత నాలుగు రోజులుగా గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి కొలుపులు నిర్వహిస్తున్నారు. ఉత్సవం సందర్భంగా అంకమ్మతల్లికి శనివారం సాయంత్రం జల్ది ఉత్సవం నిర్వహించారు. మేళతాళాలు, డప్పులతో ఏర్పాటు చేసిన ఉత్సవంలో భక్తులు కళశాలు ఎత్తుకొని అంకమ్మతల్లి ఆలయం వరకు వచ్చి నైవేద్యాలుతో పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి దర్శించుకుని పునీతులయ్యారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో గ్రామం పచ్చగా ఉండాలని గ్రామస్తులు గ్రామ దేవతలను వేడుకున్నారు. ఉత్సవం ముగింపు సందర్భంగా ఆదివారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కమిటీ నిర్వాహకులు, మాజీ సర్పంచ్ యలమందల శ్రీను తెలిపారు.

ఇరుకు గదిలో ఎన్ని కష్టాలో..!

- పదేళ్లుగా నోచుకోని నూతన భవన నిర్మాణం
- పరుల పంచన సమావేశాలు
- ఇబ్బందులు పడుతున్న ఐసీడీఎస్ సిబ్బంది



చిన్న గదిలో నిర్వహిస్తున్న ఐసీడీఎస్ కార్యాలయం



అర్ధాతరంగా నిలిచిన సొంత భవన నిర్మాణం

పొదిలి: సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. పశ్చిమ ప్రకాశంలో కీలకంగా పెద్ద ప్రాజెక్ట్ పరిధిలో ఎక్కువ మంది సిబ్బందితో పనిచేస్తోంది పొదిలిలోని కార్యాలయం. కాని ఈ ఐసీడీఎస్ కార్యాలయం ఇరుకుగా ఉండటంతో పనిచేయడానికి సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. ఐసీడీఎస్‌కు సంబంధించి సీడీపీవో కార్యాలయం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని చిన్న ఇరుకు గదిలో ఉంది. సొంత భవన నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోవడంతో సమస్యలు చుట్టుముట్టాయి. సౌకర్యాల లేమితో ఉన్న ఆ చిన్నపాటి భవనంలోనే అధికారులు పనులు నిర్వహిస్తున్నారు.

కింద కూర్చొని సమావేశాలు..

పొదిలి సీడీపీవో కార్యాలయంలో సీడీపీవో, సూపర్‌వైజర్లు, నలుగురు కార్యాలయ ఉద్యోగులు పనులు చేస్తుంటారు. 145 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 145 మంది ఆయాలతో తరుచూ నిర్వహించే సమావేశాలు పరుల పంచనే ఏళ్ల తరబడి నిర్వహిస్తున్నారు. కనీసం మరుగుదొడ్డి సౌకర్యం కూడా లేకపోవటంతో సమావేశాల రోజుల్లో కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. పొదిలి నగర పంచాయతీ, రూరల్ మండలం, కొనకనమిట్ల మండలాల నుంచి కార్యాలయానికి పనులపై వచ్చే కార్యకర్తలు, ఆయాలకు కనీసం కూర్చునేందుకు కూడా ఇరుకు భవనంలో అవకాశం లేదు. కంప్యూటర్ టేబుళ్లు, ఇతర సామగ్రికే సరిపోతుంది. సుమారు రూ.50 లక్షల వ్యయంతో నూతన భవన నిర్మాణం ప్రారంభించి పదేళ్లు గడుస్తుంది. అధికారులు ఆ భవనం గురించి పట్టించుకోవడం మానివేశారు. ఐసీడీఎస్ కార్యాలయం ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇరుకు భవనంతోనే ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయం భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

మీటింగ్ రోజుల్లో సమస్యలు..



కార్యకర్తలకు, ఆయాలకు శిక్షణ, అవగాహన తరగతులతో పాటు, నెలవారి సమావేశాలు కార్యకర్తలకు నిర్వహిస్తుంటారు. మొత్తం 150 మంది వరకు కార్యకర్తలు, సూపర్‌వైజర్లు పాల్గొంటారు. కూర్చోనేందుకు కూడా చోటు ఉండటం లేదు. సిబ్బంది కిందనే కూర్చోవాల్సి వస్తుంది. మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవటంతో సమస్యలు ఎదుర్కొంటున్నాం.

ఎం.శోభారాణి, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు

నూతన భవన నిర్మాణం పూర్తిచేయాలి..



చిన్న పాటి భవనంలో సూపర్‌వైజర్లు కంప్యూటర్ సామగ్రి ఉండటానికి ఇబ్బందులు పడుతున్నారు. సమావేశాలు జరిగే రోజుల్లో కార్యకర్తల బాధలు వర్ణనాతీతం. ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి. ఏదైనా సామగ్రి నిల్వ చేస్తే, కిందనే సమావేశాలు జరుపుతుంటారు. సమస్యలు గమనించి, అధికారులు స్పందించి నూతన భవన నిర్మాణం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– దొండ్లేరు శోభ, ఐసీడీఎస్ సిబ్బంది

యోగాతో ఆరోగ్యకరమైన జీవనం



మార్కాపురంలో యోగాసనాలు వేస్తున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్, అధికారులు



బేస్తవారిపేటలో యోగాలో పాల్గొన్న ఎంపీడీఓ, తహసీల్దార్

సాక్షినెట్‌వర్క్: యోగాతోనే ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమని, ప్రతి ఒక్కరూ.. తమ దైనందిన జీవనంలో యోగాను అలవాటుగా చేసుకోవాలని ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు, తహసీల్దార్ జితేంద్ర కుమార్ అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ యోగా డే నిర్వహించారు. గిద్దలూరులో కమిషనర్ ఈవీ రమణ బాబు తహశీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డిల ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. కొమరోలు జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థుల చేత యోగాసనాలు వేయించారు. అర్ధవీడులో తహసీల్దార్ నాగార్జునరెడ్డి, ఎంపీడీవో నర్సయ్య, ఎంఈఓలు యోగాసనాలు వేయించారు. కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, వెలిగొండ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం. వెంకటరామిరెడ్డి, ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ, జెడ్పీటీసీ కొత్తపల్లి జ్యోతి, తహసీల్దార్‌వీ కిరణ్, ఎంపీడీవో వీరభద్రాచారి పాల్గొని యోగా చేశారు. మండల కేంద్రమైన రాచర్ల జిల్లా పరిషత్ కార్యాలయంలో సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించారు.

మార్కాపురం నియోజకవర్గంలో..

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్కాపురం పట్టణంలోని నాయుడుబజారులో నిర్వహించిన యోగ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ పాల్గొన్నారు. పట్టణంలోని జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో యోగా దినోత్సవంలో మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొన్నారు. ఎస్ఎస్ కళాశాలలో చైర్మన్ నాదెళ్ల చంద్రమౌళి, కళాశాల అసోసియేట్ డాక్టర్ ఆర్‌వీఎస్‌కె రెడ్డి, మహేష్, అధ్యాపకులు, విద్యార్థులు యోగా చేశారు. ఇందిర ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల చైర్మన్ వెన్న హనుమారెడ్డి, కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో కరస్పాండెంట్ అన్నా కృష్ణచైతన్య ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. మార్కాపురం పట్టణంలోని అరవింద హైస్కూల్‌లో కరస్పాండెంట్ వాణి రాధాకృష్ణ ఆధ్వర్యంలో, వాసవి స్కూల్‌లో ప్రిన్సిపల్, కరస్పాండెంట్ రంగయ్య ఆధ్వర్యంలో, పట్టణంలోని జెడ్పీ గరల్స్ హైస్కూల్‌లో హెచ్ఎం శ్రీదేవి ఆధ్వర్యంలో, జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్‌లో హెచ్ఎం ఎం చంద్రశేఖర్‌రెడ్డి, భాష్యం హైస్కూల్‌లో ప్రకాశం జిల్లా జూన్ జెడ్‌ఈవో కృష్ణగణేష్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. కొనకనమిట్లలో ఎంపీడీఓ ఈశ్వరమ్మ, ఎంఈఓ–2 నరసింహారావు పర్యవేక్షణలో పాఠశాల హెచ్ఎం ఆదినారాయణ ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. పొదిలి మండలం పాములపాడు పంచాయతీ గొల్లపల్లిలో యోగా దినోత్సవం తహశీల్దారు ఎం వీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి.

చిన్న వర్షానికే వాహనదారుల ఇబ్బందులు



బస్టాండ్‌కు వెళ్లే దారిలో నిలిచిన వర్షపు నీరు, మురుగు నీరు

కంభం: చిన్నపాటి వర్షం కురిసిన హైవే రోడ్డుపై నుంచి బస్టాండుకు వెళ్లే రహదారిలో నీరు నిలిచిపోతుండటంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపుల సైడు కాలువలు నిర్మించినప్పటికి వర్షపు నీరు అందులోకి వెళ్లక పోవడంతో నీళ్లన్నీ రోడ్లపైనే నిలిచిపోతున్నాయి. శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి రోడ్డుపై వర్షపునీరు, కాలువల్లోని మురుగు నీరు నిలిచి పోవడం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంచాయతీ అధికారులు స్పందించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అటవీశాఖ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర



పరిసరాలను శుభ్రం చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

మార్కాపురం: స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అటవీశాఖ కార్యాలయంలో శనివారం అధికారులు పరిసరాలను పరిశుభ్రం చేశారు. పరిసరాలను పరిశుభ్రతతోనే ఆరోగ్యం వస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అటవీశాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ప్రత్యేక పూజలు



అలంకరణలో సతీసమేతంగా శ్రీవారు

కొనకనమిట్ల: మండలంలోని ప్రసిద్ధక్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ అర్చకులు సింహాద్రిచార్యులు లక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో వెంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వర స్వామి వార్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అకలంకం వెంకటరామకృష్ణాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

దర్శనం కోసం పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో నెమలిగుండ్ల రంగనాయకస్వామి

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలి గుండ్ల రంగనాయక స్వామి దర్శనం కోసం శనివారం అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. దేవస్థాన అర్చకులు అన్నవరం పాండు రంగచార్యులు, అన్నవరం సత్యనారాయణచార్యులు స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. దేవస్థానం సమీపంలోని నీటిగుండంలో భక్తులు అధిక సంఖ్యలో తలనీలాలను సమర్పించి, స్వామి వారి దర్శనం చేసుకున్నారు. స్వామి వారి దర్శణం కోసం వచ్చిన భక్తులకు గోపాలకృష్ణ యాదవ, కృష్ణదేవరాయుల కాపు బలిజ, కాశినాయన, యోగివేయన రెడ్ల, అర్యవైశ్య అన్నదాన సత్రాల్లో భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ



నోటు పుస్తకాలు,ఇతర సామగ్రి అందిస్తున్న దాత

కంభం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు దాతలు సహకరించడం అభినందనీయమని కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, అర్ధవీడు మండల విద్యాశాఖాధికారి అబ్దుల్ సత్తార్ అన్నారు. ఎన్ఆర్ఐ జిలాని రూ. 25 వేల విలువ చేసే నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర వస్తువులను ఉర్దూ మీడియం, తెలుగు మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 280 మంది విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సయ్యద్ అబ్దుల్ జలీల్, గౌస్ ఖాన్, నూర్ అహ్మద్, అస్లమ్ బేగ్, హెచ్ఎంలు, పీఏసీ చైర్మన్‌లు పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ ద్వారా నల్లబర్లీ కొనుగోలు



నల్లబర్లీ పొగాకును పరిశీలిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్

రాచర్ల: రైతులు పండించిన నల్లబర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ అధ్వర్యంలో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని గిద్దలూరు ఏడీఏ డీ బాలాజీనాయక్ అన్నారు. మండలంలోని రామాపురం, ఒద్దుల వాగుపల్లె గ్రామాల్లో నల్లబర్లీ పొగాకును శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల వద్ద మిగిలిన నల్లబర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని అదేశాలు వచ్చాయన్నారు. దీంతో వీఏఏల ద్వారా సంబంధించిన వివరాలను ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు. రైతులు వద్ద మిగిలిపోయిన నల్లబర్లీ పొగాకును ఆ యాప్‌లో నమోదు చేయించుకోవాలని, ఇది ఒక మంచి అవకాశంగా భావించాలని రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి షేక్.మహబుబ్‌బాషా, వీఏఏ శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వాలు దాసోహం



నూతన కమిటీతో సీఐటీయూ నాయకులు

బేస్తవారిపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా పనిచేస్తూ కార్పొరేట్ సంస్థలకు మేలు చేస్తున్నాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకే ఎం రఫీ అన్నారు. శనివారం స్థానిక కందుల ఓబుల్ రెడ్డి డిగ్రీ కళాశాల ఆవరణలో సీఐటీయూ మండల మహాసభ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికులకు వ్యతిరేకంగా చేపట్టిన నాలుగు లేబర్ కోడ్ చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిత్యావసర ధరలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు టీ తిరుపతిరావు, షేక్ అన్వర్‌బాషా పాల్గొన్నారు. మండల నూతన కమిటీ ఎన్నిక మహాసభలో జరిగింది. సీఐటీయూ మండల కన్వీనర్‌గా గన్నెపూడి అబ్రహాం, కోకన్వీనర్‌గా డీ తిరుపతయ్య, సభ్యులుగా గోనె రమేష్, మేడం లక్ష్మయ్య, లక్ష్మీరాజ్యం, డీ పాచామియా, మంజువాణి, డీ కాశయ్య, రహీం, వినోద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జాయింట్ పట్టాదారులకు సబ్‌డివిజన్‌కు అవకాశం



మాట్లాడుతున్న తహసీల్దార్ సురేష్

పొదిలి రూరల్: జాయింట్ పట్టాదారులు తమ భూములను సబ్‌డివిజన్ చేయించుకోవాలని తహశీల్దారు ఎం వీ కృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పొదిలి మండలంలో రీ సర్వే పూర్తైన మూగచింతల, కొండాయపాలెం, దొండ్లేరు, సలకనూతల, మాదాలవారిపాలెం, అక్కచెరువు, జువ్వలేరు, అన్నవరం, నిమ్మవరం, రాములవీడు, టి సల్లూరు, ఈగలపాడు కుంచేపల్లి, తుమ్మగుంట గ్రామాల రైతులు ఉపయోగించుకోవాలన్నారు. జాయింట్ పట్టాదారులుగా నమోదైన రైతులు అన్నదాత సుఖీభవ, తల్లికివందనం పథకాలు పొందడంలో ఇబ్బందులు తొలగించడానికి ప్రభుత్వం ప్రత్యేక సబ్‌డివిజన్ డ్రైవ్ చేపట్టిందన్నారు. రూ. 550 రుసుమును మినహాయింపు ఇచ్చి కేవలం నామ మాత్రపు రూ. 50 తో సంబంధింత గ్రామ సచివాలయంలో చెల్లించాలన్నారు. ఈసేవ జూన్ 30 తేదీ లోపు దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే వర్తిస్తుందన్నారు.

జాయింట్ పట్టాదారుల భూములకు సబ్‌డివిజన్..

కొనకనమిట్ల: ఇటీవల రీ సర్వే పూర్తైన గ్రామాల్లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన రైతుల కోసం, వారి సమస్యలను పరిష్కరించేందుకు వారి భూములను సబ్‌డివిజన్ చేస్తామని తహశీల్దార్ ఆవుల సురేష్ అన్నారు. నాగరాజుకుంట, వీరభద్రాపురం, నాగంపపల్లి, వింజవర్తిపాడు, బుడంకాయలపాడు, గరిమినపెంట, వద్దిమడుగు, గార్లదిన్నె, మర్రిపాలెం, అంబాపురం, గుర్రాలమడుగు, మునగపాడు, ఇరసలగుండం గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందన్నారు. అవకాశాన్ని ఆయా గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

కంభం: మండలంలోని రీసర్వే పూర్తయిన గ్రామాలైన జంగంగుంట్ల, కందులాపురం, కాగితాల గూడెం ఇలాఖాలో జాయింట్ పట్టాదారులుగా ఉన్న రైతులు సబ్‌డివిజన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ వీ కిరణ్ పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెన్నకేశవస్వామికి శాంతి కల్యాణం



కల్యాణానికి హాజరైన ఉభయ దాతలు

మార్కాపురం టౌన్: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మి చెన్నకేశవ స్వామికి అర్చకులు శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. కంభం రోడ్డులోని ప్రసన్న వేంకటేశ్వరస్వామికి అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు అప్పనాచార్యుల బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అలాగే రాజ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఖరీఫ్ సాగు లక్ష్యం 20,485 హెక్టార్లు



మాట్లాడుతున్న ఏడీఏ బాలాజీ నాయక్

మార్కాపురం: ఈ ఏడాది మార్కాపురం సబ్‌డివిజన్‌లో ఖరీఫ్ పంటలసాగు 20,485 హెక్టార్లు ఉండవచ్చని మార్కాపురం వ్యవసాయశాఖ ఏడీఏ బాలాజీనాయక్ తెలిపారు. ఆయన తన కార్యాలయంలో ఏఓలు, ఏఈఓలతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ 2025 ఖరీఫ్ వార్షిక ప్రణాళిక తయారు చేశామని, వివిధ పంటల్లో ఉత్పాదకత పెంచి పెట్టుబడిని తగ్గించే విధంగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు నాణ్యమైనవి సరఫరా చేయాలని, వ్యవసాయాధికారులు మండలాల్లో తనిఖీలు చేపడుతూ క్షేత్రస్థాయిలో పొలాల్లో పర్యటించాలని ఆదేశించారు. 50 శాతం రాయితీపై జనుము విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు.